ఆరోగ్య వ్యవస్థ మెరుగుదలకు దార్శనిక నాయకత్వం అవసరం: గవర్నర్ జిష్ణుదేవ్



డాక్టర్ వరుణ్ ఖన్నాకు 'విజనరీ హెల్త్‌కేర్ సీఈఓ' అవార్డును అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

బంజారాహిల్స్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత ఆరోగ్య వ్యవస్థ మరింత మెరుగుపడాలంటే దార్శనిక నాయకత్వం కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ హెల్త్ కేర్ ప్రొవైడర్ ఇండియా(ఏహెచ్‌పీఐ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో 'హైటెక్ హెల్త్‌కేర్ యుగంలో నాయకత్వం' అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సు రెండోరోజైన శనివారంతో ముగిసింది. చివరి రోజున ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నాకు 'విజనరీ హెల్త్‌కేర్ సీఈఓ' అవార్డు అందజేశారు. ఆరోగ్య సంరక్షణలో సేవా భావం ముఖ్యమని ఈ రంగాన్ని ఎప్పుడు కూడా వ్యాపార ధోరణితో చూడవద్దన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌పీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అలెగ్జాండర్‌థామస్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఐ. సహదుల్లా, హెల్త్ పాలసీ కమిటీ చైర్మన్ విశాల్ బాలి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిర్ధర్ జె. గ్యాని పాల్గొన్నారు.

భారీగా అక్రమ మద్యం పట్టివేత

● 585 మందు బాటిళ్లు స్వాధీనం.. విలువ రూ. 21.80 లక్షలు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌పీడీ) కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వివిధ ప్రాంతాల్లో శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. ఇందులో రూ. 21.80లక్షల విలువైన 585 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాయి. పహాడీ షరీఫ్ పరిధిలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్‌తో పాటుసీఐలు సుభాష్ చందర్, బాలరాజులు, ఎస్సై ప్రత్యేక టీమ్‌గా రంగంలోకి దిగి వాహనాల తనిఖీలు చేసి గోవా, ఢిల్లీ, హర్యానా నుంచి విచ్చలవిడిగా సరఫరా అవుతున్న 449 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాయి. వీటి విలువ రూ. 15 లక్షలు ఉంటుంది. ధూల్‌పేట్‌లో హైదరాబాద్ డీటీఎఫ్ సీఐ శిరిష, ధూల్‌పేట్ సీఐ గోపాల్ సిబ్బంది కలిసి 72 మద్యం బాటిళ్లను ఒక ఇంట్లో స్వాధీనం చేసుకున్నారు. తన సిబ్బందితో కలిసి సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సౌజన్య టీమ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో 47 మద్యం బాటిళ్లను, నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై చంద్రాకాంత్ సిబ్బంది పిస్తా హౌస్ ప్రాంతంలో 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. మొత్తం 136 బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నారు. వీటి విలువ రూ. 6.80 లక్షలుగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

నేటి నుంచి రాజీవ్ గాంధీ చాలెంజర్స్ సిరీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాజీవ్ గాంధీ చాలెంజర్ సిరీస్ ఉప్పల్ స్టేడియంలో సోమవారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్నామని, ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా క్రీడా మంత్రి వాకిటి శ్రీహరిని డిఫెరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ (డీఏసీఏహెచ్) ఆహ్వానించింది. సచివాలయంలో శ్రీహరిని డీఏసీఏహెచ్ అధ్యక్షుడు సురేందర్ అగర్వాల్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

శేషుబాబు, శిరీష స్మారక పురస్కారాల ప్రదానం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గాయని మర్సుకోల కళావతికి తోట శేషుబాబు, యువ కవి సల్వాది గోవర్దన్‌కు దాసరి శిరీష పురస్కారాలను నిర్వాహకురాలు అపర్ణ తోట ప్రదానం చేశారు. శనివారం బంజారాహిల్స్ లామాకాన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రచయిత్రి అపర్ణ తోట యేటా తన తల్లిదండ్రులు దాసరి శిరీష, తోట శేషుబాబు స్మారకంగా ప్రత్యామ్నాయ కళా, సాహిత్య రంగాలలో పని చేస్తున్న వారిని గుర్తించి పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని సాహిత్య విమర్శకుడు ఏకే ప్రభాకర్ అన్నారు. సల్వాది గోవర్దన్ రాసిన "మా అమ్మ కట్టెలకి పోయింది - నేనైతే గుడ్డోన్ని" కవితా సంపుటీని సినీ రచయిత్రి పింగళి చైతన్య పరిచయం చేశారు.

మాదకద్రవ్యాల నిర్మూలన బాధ్యత అందరిది

మంత్రి జూపల్లి కృష్ణారావు



ముషీరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిర్మూలన బాధ్యత అందరిదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మగ్దూమ్ భవన్.. రాజ్ బహదూర్ గౌర్ హాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి నిర్వహిస్తున్న మాదకద్రవ్యాలతో కలిగే ప్రమాదాల గురించి అవగాహన కలిగించే కళారూపాల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ప్రజానాట్య మండలి నాటక బృందం మాదకద్రవ్యాల నివారణ, అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల వద్ద తమ కళారూపాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ పాల్గొన్నారు


మ్యాజిక్ ఇఫ్ కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్

నాటకీయతకు ఆధునిక రూపం.. చంద్రశేఖర్ కథలు

సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కె.శ్రీనివాస్

బర్కత్‌పుర, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రచయిత చంద్రశేఖర్ కథలు నాటకీయతను ఆధునిక రూపంలో పరిచయం చేశాయని సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. నాటక రంగానికి చెందిన రచయితగా పేరు సంపాదించి విభిన్న రూపంలోని కథలను పొందుపరిచారన్నారు. శనివారంరాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఇండ్ల చంద్రశేఖర్ రచించిన మ్యాజిక్ ఇఫ్ కథల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చంద్రశేఖర్ భిన్నమైన కథలను సేకరించారని అన్నారు. చంద్రశేఖర్ రచించిన మరో కథల పుస్తకం బోరచెక్కు పుస్తకాన్ని కవి సిద్ధార్థ ఆవిష్కరించి మాట్లాడారు. కథలు ఎంత బాగా చదివితే కవిత్వం అంతా బాగా ఉంటుందన్నారు. ఆవిష్కరణ సభకు ప్రముఖ రచయిత కోయి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాంచంద్రరెడ్డి, ఆదిత్య కొర్రపాటి, కథల పుస్తకాల రచయిత ఇండ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నియామకంపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియామకంపై కోర్టుల స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం.. రాజ్యాంగపరమైన అవకతవక అని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసింది. సుప్రీం కోర్టు, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన, బైండింగ్ ఆదేశాలున్నప్పటికీ ఇప్పటివరకు నియామక ప్రక్రియపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని పేర్కొంది. ఇది కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడం "న్యాయవ్యవస్థ అధికారం, న్యాయపాలనపై దెబ్బ" అని సోషల్ జస్టిస్ డైరెక్టర్, జాతీయ అధ్యక్షుడు హిదాయత్ అలీ మిర్జా, డైరెక్టర్, చైర్మన్ షబ్బీర్ అలీ మీర్జాలు తెలిపారు.

ఒక్కరోజు శిక్షణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లిటరసీ, ప్రొఫెషనల్ మెలకువలపై 20 మంది ఉద్యోగార్థులకు జీహెచ్‌ఎంసీలో శనివారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. క్వియర్ బంధు అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ (1ఎం1బీ) సహకారంతో వివిధ నైపుణ్యానికి సంబంధించిన అంశాల గురించి తెలిపారు. శిక్షణ పొందిన 20 మందిలో ఆరుగురికి ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందించారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ (హెల్త్, ఎన్‌యూహెచ్‌ఎం) పంకజా, సూపరింటెండెంట్ ఇంజనీర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.


కవాడిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో బతుకమ్మలతో విద్యార్థినిలు, ఉపాధ్యాయులు


మిలీనియం స్కూల్లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు


ఎల్బీనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయురాళ్లు

పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబురాలు


మూసారాంబాగ్‌లోని బాగ్ ముసారిమో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబురాలను మండల పరిధిలోని కవాడిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ రకాల పూల తో బతుకమ్మను తయారు చేసి స్కూల్ ఆవరణలో బతుకమ్మ ఆట, పాటలతో అలరించారు. అనంతరం వాటిని స్థానిక చెరువులో నిమజ్జనం చేశా రు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు భువనేశ్వరి, రాధిక, సునీత, వరప్రియ, శ్రీనివాస్, రాములయ్య, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, సురేందర్‌రెడ్డి, సందీప్, కమలాకర్ పాల్గొన్నారు.

వనస్థలిపురం : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ ఉత్సవాలని మిలీనియం పాఠశాల చైర్మన్ రఘుబాబు అన్నారు. హయత్‌నగర్ డివిజన్ రాజప్పనగర్‌లోని మిలీనియం పాఠశాలలో బతుక మ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నా యి. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంక్‌కాలనీలో గల కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు దుర్గమ్మ వేషధారణ, సంప్రదాయ దుస్తులు వేసుకుని బతుకమ్మలతో ఆకట్టుకున్నారు. అనంతరం బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థులు అలరించారు.వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ పరిమళ, అడ్మిన్ రాధ, రవిచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి: ఎంపీ ఈటల


ఆస్పత్రిలో అశోక్‌ను పరామర్శిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

వనస్థలిపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగుల సమస్యలు సీఎం రేవంత్‌రెడ్డి పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల ఆమరణ నిరహార దీక్ష చేపట్టిన నిరుద్యోగి అశోక్‌ను గురువారం పోలీసులు వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఎంపీ ఈటల శనివారం రాత్రి అశోక్‌ను పరామర్శించి అతనికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, బీజేపీ నాయకులు ప్రేమ్‌నాథ్ పాల్గొన్నారు.

కాలనీల్లోని కంపు కనిపించడం లేదా : ఎమ్మెల్యే సబితారెడ్డి

●మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశం


లెనిన్‌నగర్‌లోని ప్రశాంత్‌నగర్‌కాలనీలో పర్యటిస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కాలనీల్లోని కంపు కనిపించడం లేదా.. రోడ్లపై మురుగునీరు వరదలా పారుతుంటే ప్రజలు ఎలా ఉండగలుగుతారు?.. అసలు మీరంతా ఏం చేస్తున్నారు?.. అని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి మీర్‌పేట్ మునిసిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి 35వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్‌తో పాటు పరిసర కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉన్నదంటూ మాజీ కార్పొరేటర్ జిల్లెల సౌందర్యావిజయ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం ఆమె మునిసిపల్ అధికారులతో కలిసి ఆయా కాలనీల్లో పర్యటించారు. ఈసందర్భంగా రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీటిలోనే ఆమె పాదయాత్ర చేశారు. అక్కడి దుర్భర పరిస్థితిని చూసి ఆమె అవాక్కయ్యారు. జీవనదిలా డ్రైనేజీ నీరు ఇళ్ల ముందు నుంచి ప్రవహిస్తుంటే మీరు ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి తక్షణ పరిష్కార మార్గం చూడాలని ఆమె వారికి సూచించారు. అప్పటికప్పుడు ఎస్‌ఎన్‌డీపీ ప్రాజెక్టు అధికారులతోనూ ఆమె ఫోన్‌లో మాట్లాడారు. రోడ్లపై మురుగునీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు దిగువ కాలనీల్లోకి రాకుండా చూడాలని వారికి సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, నవీన్, సునీతాబాల్‌రాజ్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి ఎల్వోసీ అందజేత

సరూర్‌నగర్ : మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ 16వ డివిజన్ తిరుమలానగర్‌కాలనీకి చెందిన నారాయణగౌడ్ ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరగా, వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి గుండెకు సర్జరీ చేయాలని పేర్కొన్నారు. దాంతో పేద కుటుంబానికి చెందిన ఆయన మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్‌యాదవ్ సహకారంతో ఎమ్మెల్యే సబితారెడ్డిని కలువగా ఆమె సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షలు మంజూరు చేయించారు. దానికి సంబంధించిన ఎల్‌వోసీని శనివారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మీర్‌పేట్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనునాయక్ పాల్గొన్నారు.

వైద్యం వికటించి చిన్నారి మృతి

● వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందిందని ఆందోళన

వనస్థలిపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి చిన్నారి మృతిచెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం భీమనపల్లికి చెందిన ద్యానమోని శేఖర్ జ్యోతి దంపతులకు ఒక కొడుకు, కూతురు(కవలపిల్లలు) సంతానం. కూతురు నిహారిక(11) ఐదవ తరగతి చదువుతుంది. గురువారం రాత్రి తన ఇంట్లో పది రూపాయల బిల్ల నోట్లో పెట్టుకుని ఆడుకుంటుంది. ఈ క్రమంలో నిహారిక ఒక్కసారిగా ఆ బిల్లను మింగింది. విషయం గమనించిన చిన్నారి తల్లిదండ్రులు సమీపంలోని వైద్యులను సంప్రదించగా చిన్నారికి చికిత్స చేయడానికి వారు నిరాకరించారు. దీంతో వనస్థలిపురంలోని తన్వీ ఆస్పత్రిలో అదే రాత్రి చిన్నారిని అడ్మిట్ చేశారు. ఆస్పత్రి వైద్యులు చిన్నారి గొంతులో ఇరుక్కున్న పది రూపాయల బిల్లను బయటకు తీశారు. దీంతో చిన్నారి నిహారిక ఆరోగ్యంగా ఉందని, ఇంటికి తీసుకెళ్లమని సూచించడంతో ఆమె తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం ఇంటికి తీసుకెళ్లారు. కాగా శుక్రవారం సాయంత్రం నుంచి చిన్నారి నిహారిక నీరసంగా ఉండడంతో సమీపంలోని వైద్యులను సంప్రదించగా పల్స్ రేట్ పడిపోతుంది, నగరంలోని తన్వీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు శనివారం ఉదయం ఆస్పత్రికి తీసుకవచ్చిన నిహారికను వైద్యులు పరీక్షించారు. చిన్నారి నిహారిక చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కూతురు మృతిచెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ముందు కాసేపు ఆందోళన చేపట్టారు. కాగా సమాచారం అం దుకున్న పోలీసులు బాధిత కుటంబ సభ్యులకు నచ్చజెప్పి అక్కడ నుం చి పంపించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు, రిమాండు

● భారీగా నగలు, నగదు రికవరీ చేసిన పోలీసులు

హయత్‌నగర్ : ఇంటి తాళాలు ధ్వంసం చేసి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను హయత్‌నగర్ క్రైం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 22.6 తులాల బంగారు ఆభరణాలు, 6 తులాల వెండి వస్తువులు, రూ.3లక్షల నగదు, అమెరికాకు చెందిన ఖరీదైన అర్మని రిస్టు వాచ్, మారుతి షిప్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను శనివారం రిమాండుకు తరలించారు. వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం, నార్లపూర్ గ్రామంలోని రాంనాయక్‌తండాకు చెందిన మండ్ల శివ(32) కూలీ పని చేస్తాడు. కొంతకాలంగా నగరంలోని కర్మన్‌ఘాట్ కాకతీయనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రధాన నిందితుడైన శివ ఇప్పటి వరకు 20 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. శివ కేవలం ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేయడంలో దిట్ట. ఇప్పటి వరకు వివిధ పోలీస్‌స్టేషన్‌లో సుమారు ఇరవై కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు సంతోష్‌నగర్‌కు చెందిన ఎల్ల బాలకృష్ణ(35) కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. బీఎన్‌రెడ్డి చైతన్యనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఎల్ల బాలకృష్ణ రెండు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో డబల్ హత్య కేసులో నిందితుడు. నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద ముద్దునూరుకు చెందిన మోత్కూర్ శ్రీకాంత్(35)పెయింటర్‌గా పని చేస్తాడు. ఇతడు చోరీ చేసిన సొత్తును అనుమానం రాకుండా బంగారం తాకట్టు షాపుల్లో విక్రయిస్తాడు. మూడు నెలల క్రితం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏ1 మండ్ల శివ ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడి పోలీసులకు దొరికాడు. దీంతో పోలీసులు శివను రిమాండుకు తరలించారు. జైలులో ఏ2 ఎల్లా బాలకృష్ణతో శివకు పరిచయం ఏర్పడింది. నెల రోజుల క్రితం శివ, బాలకృష్ణలు బెయిలుపై విడుదల అయ్యారు. సెప్టెంబరు 6న బంజారాకాలనీ సమీపంలో ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం చేసి నగలు, నగదు అపహరించుకుపోయారు. 13వ తేదీన మునగనూరు జయసూర్యనగర్‌కాలనీలో ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న 33తులాల బంగారు ఆభరణాలు, అమెరికాకు చెందిన ఖరీదైన రిస్టు వాచ్, రెండు వేల రూపాయలను అపహరించుకుపోయారు. అపహరించిన బంగారాన్ని శ్రీకాంత్ ఎల్బీనగర్‌లోని అట్టిక గోల్డ్‌షాపులో విక్రయించాడు. పోలీసులు నిందితులను అరెస్టుచేసి రిమాండుకు తరలించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్ : సీఎం సహాయనిధి పేదల పాలిటీ వరంగా మారిందని మాజీ జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్ అన్నారు. మండలంలోని లష్కర్‌గూడకు చెందిన మునుకుంట్ల యాదగిరికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.30వేల చెక్కును శనివారం దేవదాసు గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు శ్రీధర్, సుదర్శన్‌రెడ్డి, నరసింహ, రమేష్, నాయకులు పాల్గొన్నారు.

బస్‌రూట్‌ను పరిశీలించిన డీఎం

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బీసీ కాలనీ బస్‌రూట్‌ను హయత్‌నగర్-1 డిపో మేనేజర్ విజయ్ శనివారం పరిశీలించారు. డీఎం మెట్‌లోని బీసీ, ఎస్సీకాలనీ రూట్‌ను సందర్శించి వారితో మాట్లాడారు. త్వరలో కాలనీకి బస్సు సర్వీసును ప్రారంభిస్తామని డీఎం చెప్పినట్లు శివకుమార్ తెలిపారు.

పోకిరీల భరతం పడుతున్న షీటీమ్స్

● 15 రోజుల్లో 310 మంది పోకిరీలను పట్టుకున్న రాచకొండ షీటీమ్స్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలను వేధించే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని, ఎవరైనా వేధింపులకు గురిచేస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషారాణి అన్నారు. గడిచిన 15 రోజుల్లో మహిళలను ఆన్‌లైన్‌లో, భౌతికంగా వేధించిన 310 మందిని పట్టుకున్నామని తెలిపారు. ఆన్‌లైన్‌తో పాటు వ్యక్తిగతంగా వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన షీటీమ్స్ నిందితులను అదుపులోకి తీసుకొని, వారిలో 7గురిపై క్రిమినల్ కేసులు 98 మందిపై పెట్టీ కేసులు నమోదు చేశామన్నారు. మిగతా వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇప్పించామన్నారు. కమిషనరేట్ పరిధిలో 79 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి 17,450 మంది మహిళలకు హక్కులు, చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం : సుధీర్‌రెడ్డి


ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదల పాలిట వరం అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వెన్నముక సమస్యతో బాధపడుతున్న గడ్డిఅన్నారం డివిజన్ కోదండరామ్‌నగర్ వాసి శ్రీధర్ చికిత్స నిమిత్తం మంజూరు చేయించిన రూ.2లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బాధితుని సోదరుడు నవీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాద శంకర్ పాల్గొన్నారు.

ఎల్ఓసీ పత్రం అందజేత

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీకి చెందిన లింగయ్య కుమారుడు శివవరుణ్ అనారోగ్య సమస్యతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. స్థానిక బీఆర్ఎస్ నాయకుల సూచన మేరకు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో వారికి రూ.2లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన ఎల్‌సీఓ పత్రాన్ని బీఆర్ఎస్ మన్సూరాబాద్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి బాధితుడి తండ్రి లింగయ్యకు అందజేశారు. జక్కిడి మల్లారెడ్డి, నర్రి వెంకన్న, సుగ్రీవ, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.